https://epaper.manasamajam.com Contact No. 9989788438, 9505285656

# మన సమాజం

తెలుగు డిజిటల్ దిన పత్రిక

Truth towards the Society

చైర్మెన్ : పార్వతి సురేష్ కుమార్ ఎడిటర్ : పార్వతి రాజేష్ కుమార్

సంపుటి : 02 సంచిక : 92 శనివారం 8-08-2026 పేజీలు : 4

రిపోర్టర్స్ కావలెను

మన సమాజం

Truth towards the Society

మన సమాజం తెలుగు డిజిటల్ దినపత్రికలో

నిఖార్సైన జర్నలిస్టుగా నిలబడాలనుకుంటున్నారా?

అన్ని తరహా వార్తలు, కథనాలు ఎలాంటి ఆంక్షలు లేకుండా

రాయాలని కోరుకుంటున్నారా?

తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాలు, మండలాలల్లో

పనిచేసేందుకు విలేఖరులు కావలెను...

మీ కలాలకు పదును పెట్టండి.

సంప్రదించవలసిన నెంబర్లు

9989788438, 9505485656.

## కోటీశ్వరులకు రైతుబంధు ఎందుకు?

**లగ్జరీ బైకులు వాడేవారికి రీయింబర్స్‌మెంట్ ఎందుకు?**

**ఉచిత పథకాలతో త్వరలో ప్రమాదకర పరిస్థితులు**

**రాష్ట్ర జనాభాకు మించి తెల్ల రేషన్ కార్డుదారులు**

**రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు చురకలు**



**హైదరాబాద్, ఆగస్టు 7:**
ఉచిత పథకాలతో త్వరలో రాష్ట్రంలో చాలా ప్రమాదకర పరిస్థితులు ఏర్పడతాయని హైకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. కోటీశ్వరులకు రైతుబంధు, లగ్జరీ బైక్‌లపై తిరిగే వారికి ఫీజు రీయింబర్స్‌మెంట్ ఎందుకని జస్టిస్ నగేశ్ భీమపాక వ్యాఖ్యానించారు. స్టాంప్ డ్యూటీపై కంటోన్మెంట్ బోర్డు నుంచి వసూలు చేసిన సర్‌ఛార్జిని తిరిగి చెల్లించేలా ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ కంటోన్మెంట్ బోర్డు మెంబర్‌గా వ్యవహరించిన జె.రామకృష్ణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై ఇటీవల విచారణ చేపట్టిన హైకోర్టు సర్‌ఛార్జి తిరిగి చెల్లించాలని ప్రభుత్వాన్నిఆదేశించింది. కోర్టు ఆదేశాలు అమలు కాకపోవడంతో పిటిషనర్ జె.రామకృష్ణ హైకోర్టులో కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. ఈ కేసులో ప్రతివాదిగా ఉన్న ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియాకు పలుమార్లు నోటీసు ఇచ్చినప్పటికీ అఫిడవిట్ దాఖలు చేయకపోవడంతో పాటు ప్రత్యక్ష హాజరు నుంచి మినహాయింపు కోరకుండానే గైర్హాజరు కావడంపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆయనపై కొద్ది రోజుల క్రితం బెయిలబుల్ వారంట్ జారీ చేసింది. వారంట్ అమలు చేయాలని హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌కు ఆదేశాలు జారీ చేసింది. రూ.5 వేల విలువకు వ్యక్తిగత బాండ్ ఇస్తేనే బెయిల్ ఇవ్వాలని పేర్కొంది.

## రాబడి పెరగాలి... వ్యాపారం సాగాలి

### అన్ని శాఖల సమన్వయంతో జీఎస్టీ పెంచాలి

**నిర్మాణ సామగ్రి జీఎస్టీలో లీకేజీలున్నాయి**

**అనుమతుల దశలోనే పన్ను అంచనా వేయండి**

**ఏఐతో పని సులభతరం చేస్తాం: సీఎం రేవంత్**

**ఆర్థికవేత్త అరవింద్ సుబ్రమణియన్‌తో భేటీ**

**సమావేశంలో పాల్గొన్న రాష్ట్ర ఉన్నతాధికారులు**



**హైదరాబాద్, ఆగస్టు 7:**
పన్ను వసూళ్లలో టెక్నాలజీ వాడుకోవడమంటే వ్యాపారులను వేధించడం కాదని, రాష్ట్ర ఖజానాకు రాబడిని పెంచుకుంటూనే సులభతర వాణిజ్యాన్ని మెరుగుపరచాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఏఐ ఆధారిత వ్యవస్థల అమలులో వ్యాపారాలకు ఎలాంటి ఆటంకాలు, ఇబ్బందులు కలగకుండా చూడాలని చెప్పారు. తెలంగాణ ఆర్థిక వ్యవస్థ వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో రాష్ట్రంలో జీఎస్టీ ఆదాయం పెంచేందుకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగించే విషయమై శుక్రవారం ఆయన ప్రముఖ ఆర్థికవేత్త అరవింద్ సుబ్రమణియన్, రాష్ట్ర ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచడంలో ప్రణాళికబద్ధంగా ముందుకు సాగడంపై చర్చించారు. ముఖ్యంగా జీఎస్టీ, ఎక్సైజ్ శాఖల్లో చేపట్టాల్సిన సంస్కరణలపై ముఖ్యమంత్రి లోతుగా చర్చించారు. జీఎస్టీ అధికారులకు ఏఐ ఆధారిత సమాచారంతో పనిని సులభతరం చేసే వ్యవస్థను తెస్తామని సీఎం చెప్పారు. ఈ క్రమంలో వ్యాపారాలకు ఎలాంటి ఆటంకాలు, ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు.

రాష్ట్ర ఖజానాకు రాబడి పెంచుతూనే సులభతర వాణిజ్యం(ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్)ను మెరుగుపరిచేలా టెక్నాలజీ వినియోగం ఉంటుందని సుబ్రమణియన్ వివరించారు. భవన, నిర్మాణ సామగ్రి విషయంలో లీకేజీలను అరికట్టే విధంగా మున్సిపల్, రెరా, పంచాయతీరాజ్, విద్యుత్, ఆర్థిక, వాణిజ్య పన్నుల శాఖల మధ్య ఏఐ సాయంతో సమన్వయం చేసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. భారీ భవనాలు, కాంట్రాక్టు పనులకు సంబంధించిన అనుమతులను దరఖాస్తు దశలోనే నిర్మాణ సామగ్రి అవసరాలను, దానికి అనుగుణంగా పన్నుల అంచనాల వివరాలను నమోదు చేయాలని స్పష్టం చేశారు. మీ-సేవ, ఆరోగ్యశ్రీ, సీఎంఆర్ఎఫ్ వివరాలను కూడా సమీకృతం చేస్తే పరిపాలనతో ఉపయోగపడుతుందని సీఎం అభిప్రాయపడ్డారు.

## సంకల్పాలున్నాయి.. సాధ్యం చేసి చూపిస్తా

**సీఎం చంద్రబాబు**

**ఏటా 25 వేలు.. ఇప్పటికే ఉచిత విద్యుత్, పింఛన్**

**ఇంకా చేయాలని ఉందిగానీ, ఖజానా ఖాళీ**

**చేనేత నైపుణ్యాలకు మెరుగులు దిద్దుతాం**

**కారిడార్,ఎయిర్‌పోర్ట్ వస్తే చీరాలకు మహర్దశే**

**అడ్డంకులెన్ని వచ్చినా రాష్ట్ర హితంపై రాజీ లేదు**

**'నేతన్న సేవలో' పథకానికి సీఎం శ్రీకారం**

**71,536 కుటుంబాల ఖాతాల్లో 179 కోట్లు జమ**



**బాపట్ల, ఆగస్టు 7**
ఆర్థిక కష్టాలున్నా సంక్షేమం, అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నామని, ఎవరెన్ని అడ్డంకులు సృష్టించినా రాష్ట్రం హితం కోరే విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. రెండేళ్లలో రూ. 1,50,000 కోట్ల సంక్షేమం అందించామన్నారు. ఇంకా చేయాలని ఉందిగానీ ఖజానా ఖాళీగా ఉందని వ్యాఖ్యానించారు. బాపట్ల జిల్లా చీరాల నియోజకవర్గ పరిధిలోని కొత్తపేటలో శుక్రవారం జరిగిన 12వ జాతీయ చేనేత దినోత్సవంలో చంద్రబాబు పాల్గొన్నారు. నేతన్నల సేవలో... పథకానికి ఆ వేదికపై నుంచి శ్రీకారం చుట్టారు. రూ.25 వేల చొప్పున రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 71,536 నేతన్నల కుటుంబాలకు రూ.179 కోట్లను సీఎం విడుదల చేశారు. అనంతరం ప్రజా వేదిక సభలో మాట్లాడారు. 1.27 లక్షల కుటుంబాలు చేనేతపై ఆధారపడి జీవనం సాగిస్తున్నాయన్నారు. "చీరాల పేరు వింటేనే నేతన్నల నైపుణ్యం గుర్తుకు వస్తుంది. చీరాల, వెంకటగిరి, ధర్మవరం, ఉప్పాడ, మంగళగిరి, పొందూరు, పెడ న, శ్రీకాళహస్తి ఉత్పత్తులు విశిష్ఠ గుర్తిం పు పొందాయి" అని సీఎం అన్నారు. చేనేత కార్మికుల కుటుంబాలకు ఉచిత విద్యుత్ కూడా ఇస్తున్నామన్నారు. దీని ద్వారా 62,541 చేనేత కుటుంబాలకు, 10,032 పవర్‌లూమ్ కుటుంబాలకు మేలు జరుగుతోందన్నారు. 85 వేల మంది చేనేతల కు నెలకు రూ.4,000 చొప్పున పింఛన్ అందిస్తున్నాం. స్మాల్ క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రో గ్రాం కింద రూ.10 కోట్ల వ్యయంతో 10 చేనే త క్లస్టర్లకు ఆమోదం తెలిపాం.." అని చంద్రబాబు తెలిపారు. ఆయన ఏమన్నారంటే.. "టీడీపీకి బీసీలే అండ. ఈ వర్గాల సంక్షే మం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉంది. వారి కి రక్షణ కల్పించేందుకు ప్రత్యేక చట్టం తెస్తు న్నాం. చేపల వేట నిషేధ సమయంలో 1.34 లక్షల మత్స్యకార కుటుంబాలకు రూ.20 వే లు చొప్పున రెండేళ్లలో రూ.505 కోట్లు ఇ చ్చాం. వడ్డెరలకు మైనింగ్ లీజులు, గీత కార్మికులకు ఎక్సైజ్ షాపులు కేటాయించాం. రూ.12 లక్షల కోట్ల పెట్టుబడులు ఇప్పటికే రాష్ట్రానికి వచ్చాయి.

## ఆందోళన వద్దు.. నేను మీతోనే!

**ఎన్డీయే ఎంపీలకు మోదీ హామీ.. 37 మందితో అల్పాహార భేటీ**



**న్యూఢిల్లీ, ఆగస్టు 7:**
పార్లమెంటు.. ప్రజాస్వామ్య అత్యున్నత దేవాలయమని ప్రధాని మోదీ అన్నారు. అయితే దాని కార్యకలాపాలను తరచూ అడ్డుకోవడం బాధాకరమని చెప్పారు. గందరగోళం కారణంగా కొత్త సభ్యులకు సభలో మాట్లాడే అవకాశం లభించడం లేదన్నారు. ఇది వారికి జరుగుతున్న అన్యాయమని.. పార్లమెంటు సమావేశాలు సజావుగా జరగాలని వ్యాఖ్యానిం చారు. దీనిపై ఆందోళన చెందాల్సిన పనిలేదని.. కొత్త సభ్యులకు తన మద్దతు ఉంటుందని తెలిపారు. శుక్రవారం తన అధికార నివాసంలో ఆయన 37 మంది ఎన్డీయే ఎంపీలతో అల్పాహార విందు సమావేశంలో పాల్గొన్నారు. వీరిలో 20 మంది ఎన్సీపీఐ ఎంపీలు (టీఎంసీ రెబెల్స్), శివసేన(శిండే)లో చేరిన ఆరుగురు శివసేన-యూబీటీ ఎంపీలతో పాటు అన్నాడీఎంకే, ఆర్పీఐ (అథావలే), రాష్ట్రీయ లోక్‌మోర్చా, యూపీపీఎల్ సభ్యులు కూడా ఉన్నారు. 'మీమీ రాష్ట్రాల అభివృద్ధి కోసం పాటుబడండి. రాష్ట్రాలు అభివృద్ధి చెందితేనే దేశం పురోగమిస్తుంది. ఎన్డీఏ ఓ కుటుంబం. మనమంతా భాగస్వామ్య పార్టీలం. ప్రతి ఒక్కరికీ గౌరవం, అవకాశం దక్కుతాయి.

## వచ్చే ఎన్నికల్లో గెలుపు మాదే..

**ఒంటరిగానే పోటీ చేస్తాం: బీజేపీ చీఫ్ రాంచందర్ రావు..**

ఢిల్లీ: తెలంగాణలో అధికారంలోకి రావడమే బీజేపీ టార్గెట్ అని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు అన్నారు. అధికారం చేపట్టే విషయంలో ఎవరితోనూ పొత్తు ఉండదని పేర్కొన్నారు. తెలంగాణలో జనసేనతో సహా ఏ పార్టీతోనూ పొత్తు పెట్టుకోబోమని ఆయన తేల్చి చెప్పారు. అయితే, ఎన్డీయే కూటమిలో జనసేన పార్టీ భాగస్వామి అని, దానిపై జాతీయస్థాయిలోనే నిర్ణయం ఉంటుందని స్పష్టం చేశారు. బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రాంచందర్ రావు, కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్, ఎంపీలతో బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో బీజేపీ



బలోపేతంపై కీలకంగా చర్చించారు. నియోజకవర్గాల వారీగా పార్టీ పరిస్థితిని సమీక్షించారు.

## రఫేల్ తయారీ భారత్‌లోనే..

**114 రఫేల్స్‌లో 94 జెట్లు స్థానికంగా ఉత్పత్తి**

**సంసిద్ధత వ్యక్తం చేస్తూ ఫ్రాన్స్ ప్రతిపాదన**

**దేశీయ రక్షణ తయారీ రంగానికి ఊతం**



**న్యూఢిల్లీ, ఆగస్టు 7:**
దేశీయ రక్షణ రంగాన్ని బలోపేతం చేసే దిశగా కీలక ముందడుగు పడింది. భారత వాయుసేన కోసం తలపెట్టిన రూ.3.25 లక్షల కోట్ల మెగా రఫేల్ డీల్‌లో భాగంగా అందించాల్సిన 114 యుద్ధ విమానాల్లో 94 జెట్లను భారత్‌లో తయారు చేసేందుకు ఫ్రాన్స్ సంసిద్ధత వ్యక్తం చేస్తూ అధికారిక ప్రతిపాదన సమర్పించింది. ఇది కార్యరూపం దాలిస్తే ఫ్రాన్స్ వెలుపల రఫేల్ యుద్ధ విమానాలు తయారవడం ఇదే తొలిసారి కానుంది.

భారత్ ఈ ఏడాది మే నెలలో 114 రఫేల్ యుద్ధ విమానాల కొనుగోలుకు సంబంధించిన లెటర్ ఆఫ్ రిక్వెస్ట్ (ఎల్‌వోఆర్)ను ఫ్రాన్స్‌కు పంపింది. దానికి ప్రతిస్పందనగా ఆ దేశం తాజాగా ఈ పూర్తిస్థాయి ప్రతిపాదనను భారత్‌కు సమర్పించింది. దీనిలో భారత్‌లో తయారీ, సాంకేతికత బదిలీ, స్వదేశీ ఆయుధాల అనుసంధానానికి అధిక ప్రాధాన్యతనిచ్చింది. ప్రస్తుతం రక్షణ మంత్రిత్వ శాఖ, వాయుసేనకు చెందిన అక్విజిషన్ విభాగం ఈ ప్రతిపాదనను నిశితంగా పరిశీలిస్తున్నాయని రక్షణశాఖ వర్గాలు తెలిపాయి. కాగా, ఫ్రాన్స్ ప్రతిపాదనల్లో ముఖ్యమైనది తాను అందించాల్సిన 114 రఫేల్ యుద్ధ విమానాల్లో 94 జెట్లను భారత్‌లోనే స్థానిక సంస్థల భాగస్వామ్యంతో తయారు చేయడం. ఈ కార్యక్రమంలో దసో ఏవియేషన్‌తో పాటు ఫ్రాన్స్‌కు చెందిన ప్రముఖ రక్షణ సంస్థలైన ఎంబీడీఏ, సాఫ్రాన్, థేల్స్ కూడా భాగస్వామ్యం కానున్నాయి. ఈ ప్రాజెక్టు భారత ఏరోస్పేస్ రంగానికి గొప్ప ఊపునిస్తుందని.. టాటా, ఎల్ అండ్ టీ వంటి భారతీయ కంపెనీలు, ఇతర దేశీయ రక్షణ రంగ సంస్థలకు అపారమైన అవకాశాలు కల్పిస్తుందని భావిస్తున్నారు.

# మొన్న ఆటో.. నిన్న బైకు..

**- ప్రాణాలు పోతే గాని పట్టించుకోరా..?**

**- కళశాల దారిలోనే ప్రమాదాలు..విద్యార్థుల్లో భయం - ఇగ ఇంత జరిగినా నిద్రేనా..?**





**లక్షెట్టిపేట ఆగస్టు07(మన సమాజం)**
లక్షెట్టిపేట పట్టణంలోని మిషన్ కాంపౌండ్ ఏరియాలో రోడ్డు ప్రమాదాలు రోజురోజుకీ పెరిగిపోతున్నయ్. ఆ ఏరియాలో ఉన్న ప్రమాదకరమైన కల్వర్టు దగ్గర ఇప్పటికే చాలా సార్లు ప్రమాదాలు జరిగాయి. వాహనదారులు, ప్రయాణికులు గాయాలతో ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నా.అధికారులు, ప్రజాప్రతినిధులు మాత్రం చీమ కుట్టినట్టు కూడా పట్టించుకోవడం లేదని స్థానికులు మండిపడుతున్నరు.సీఎస్ఐ చర్చి వైపు వెళ్లే ఈ రోడ్డుపై ఉన్న కల్వర్టు చాలా ప్రమాదకరంగా మారింది. గత నెలలోనే అక్కడ పలు ప్రమాదాలు జరిగాయి. అయినా సంబంధిత అధికారులు ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని విమర్శలు వినిపిస్తున్నయ్.ఈ దారి గుండా కాలశాలలకు వెళ్లే విద్యార్థులు నిత్యం ప్రయాణిస్తుంటారు. గత కొన్ని రోజుల క్రితం విద్యార్థులతో వెళ్తున్న ఆటోను బోలెరో వాహనం ఢీకొట్టడంతో అందులో పడి విద్యార్థులు గాయపడి భయాందోళనలకు గురయ్యారు. అలాగే ఒక వారం రోజుల క్రితం ఒక ద్విచక్ర వాహనం అదుపు తప్పి అందులో పడి తీవ్ర గాయాలు అయ్యాయి.

ఇలాంటి ఘటనలు జరుగుతున్నా పాలకులు మాత్రం తడిగుడ్డ వేసుకొని గమ్మున కూర్చున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికైనా పై అధికారులు స్పందించి ప్రమాదాలు జరగకుండా తక్షణమే చర్యలు తీసుకోవాలని, కల్వర్టు వద్ద భద్రతా చర్యలు చేపట్టాలని లక్షెట్టిపేట ప్రజలు కోరుతున్నారు.

## సమస్యల సాధనకు కలిసి రావాలి



**రాయికల్ ఆగస్టు 07**
పీఅర్సీ, డిఎల సాధన కోసం పీఆర్టియు టిఎస్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 1 న తలపెట్టిన మహా ధర్నాకు ఉద్యోగ, ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో తరలివచ్చి... విజయవంతం చేయాలని ఆ సంఘ జిల్లా ఆనంద్ రావు పిలుపు నిచ్చారు. రాయికల్ మండలం అల్లిపూర్, ఉప్పుమడుగు అయోధ్య, రాయికల్, ఇటిక్యాల, కొత్తపేట్, మూటపల్లి తో పాటు పలు గ్రామాల్లో శు క్రవారం సభ్యత్వం నిర్వహించారు. ఆయా పాఠశాల ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ డిఎస్సీ 2003 ఉపాధ్యాయులకు పాత పెన్షన్ వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిపెస్టోలో పేర్కొన్న విధంగా ఉపాధ్యాయులందరికి సైతం పాత పెన్షన్ అమలు చేయాలని కోరారు.సమస్యల పరిష్కారించడంలో జాప్యం చేయడం తగదాన్నారు.ఈ కార్యక్రమంలో పీఆర్టియు మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శి అంతడుపుల గంగారాజం, రాపర్తి నర్సయ్య,రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు పొన్నం రమేష్, బొమ్మ కంటి రవికుమార్,రాష్ట్ర కార్యదర్శి గాజంగి రాజేశం,లక్కడి రాజరెడ్డి,తాటిపల్లి వేణు గోపాల్ జిల్లా అసోసియేట్ అధ్యక్షులు కన్నవేణి మల్లారెడ్డి,జిల్లా కార్యదర్శి దొంతి సతీష్,,ఊసకోల రాము,బాపురావు లు పాల్గొన్నారు

## తల్లిపాల వారోత్సవాల ముగింపు కార్యక్రమం



**రాయికల్, ఆగస్టు 8**
రాయికల్ మండలం ఇటిక్యాల గ్రామంలో శుక్రవారం రోజున తల్లిపాల వారోత్సవాలు కార్యక్రమంలో భాగంగా ఎస్ . హెచ్. జి మహిళా సంఘాల సభ్యులను సమావేశపరిచి తల్లిపాల ప్రాముఖ్యత గూర్చి తల్లిపాల వలన కలిగే లాభాలు తల్లి బిడ్డ క్షేమం గురించి ముర్రుపాలు ప్రాముఖ్యత పాలలో ఉండే పోషకాల గురించి వివరంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి తోట రాజేష్, అంగన్వాడి టీచర్స్ బుజ్జమ్మ, సహేరా, సుజాత, అనురాధ, రమ్య, వివోఏలు బోగ లావణ్య, రాధ, చంద రాధా,మరిపెల్లి మాధురి మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## కథలాపూర్ పోలీస్ వారి హెచ్చరిక

**కథలాపూర్ ఆగస్టు 07**



కథలాపూర్ మండల పరిధిలోని ప్రజలకు కథలాపూర్ ఎస్ ఐ రవికిరణ్ గారు పత్రిక ముకంగా తెలుపుతూ ప్రస్తుత కాలంలో సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లైన వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్, షేర్‌చాట్ తదితర సామాజిక మాధ్యమాలు మరియు ఇతర యాప్‌లలో ఎటువంటి వ్యక్తి, వర్గం లేదా సమాజాన్ని కించపరిచే విధంగా, అవమానించేలా, రెచ్చగొట్టే విధంగా లేదా ఇతరులకు ఇబ్బంది కలిగించేలా పోస్టులు, ఫోటోలు, వీడియోలు, మెసేజ్‌లు లేదా కామెంట్లు చేయడం, షేర్ చేయడం, ఫార్వర్డ్ చేయడం చేయరాదని హెచ్చరించారు. ఇలాంటి అభ్యంతరకరమైన, రెచ్చగొట్టే లేదా శాంతిభద్ర తలకు విఘాతం కలిగించే పోస్టులను సృష్టించిన వారిపైనే కాకుండా, వాటిని ఉద్దేశపూర్వకంగా షేర్/ఫార్వర్డ్ చేసే వారిపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకొని కేసులు నమోదు చేయబడతాయి. కావున ప్రజలందరూ సోషల్ మీడియాను బాధ్యతాయుతంగా వినియోగించాలని, ఇతరుల మనోభావాలను దెబ్బతీసే లేదా సమాజంలో అశాంతికి దారితీసే ఎటువంటి సమాచారాన్ని పోస్ట్ చేయడం, షేర్ చేయడం లేదా ఫార్వర్డ్ చేయడం చేయవద్దని ఈ మేరకు కథలాపూర్ ఎస్ఐ శ్రీ రవికిరణ్ గారు తెలిపారు.

## కోరుట్ల ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన శ్యామ్ రాజ్

**కోరుట్ల ఆగస్టు 07**



జగిత్యాల జిల్లా కోరుట్ల పోలీస్ స్టేషన్ లో ఎస్సైగా నియమితులైన శ్యామ్ రాజ్ శుక్రవారం సాయంత్రం పదవి బాధ్యతలు స్వీకరించారు ఈ సందర్భంగా పోలీస్ అధికారులు సిబ్బంది ఆయనకు స్వాగతం పలికి అభినందనలు తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ చట్ట పరిరక్షణ శాంతి భద్రతల పరిరక్షణకు కట్టుబడి విధులు నిర్వహిస్తానని శ్యామ్ రాజ్ తెలిపారు స్థానిక ప్రజాప్రతినిధులు వివిధ రాజకీయ నాయకులు ప్రజలు శుభాకాంక్షలు తెలియజేస్తూ కోరుట్లలో సమర్థవంతమైన పోలీస్ సేవలు అందించాలని ఆకాంక్షించారు.

## రాయికల్ మండల కేంద్రంలో ఘనంగా జాతీయ చేనేత దినోత్సవం



**రాయికల్ ఆగస్టు 07**
రాయికల్ పట్టణ పరిధిలోని శ్రీ శివ భక్త మార్కండేయ దేవస్థానం యందు చేనేత దినోత్సవం వేడుకలు ఘనంగా జరిగాయి జాతీయ స్థాయిలో చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రతి సంత్సరము ఆగస్టులో ఎడ వ తేదీన జరుగుతుందని స్వదేశీ ఉద్యమాన్ని మరింత గుర్తింపు గా 1905 ఆగస్టులో ఎడవ తారీఖు ప్రారంభం చేసుకుని స్వదేశీ ఆందోళన స్ఫూర్తితో చేనేత కార్మికులు కష్టాన్ని వారి కల నైపుణ్యాన్ని గౌరవించు దానికోసం ఈ రోజు ప్రత్యేక మూగ కేటాయించిన రోజు ఇది. కష్టాన్ని దారంగా మార్చి కలలకు రంగులు అది మన సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబించే విధంగా వస్త్రం గా నేస్తం అభూతకల్పనలు ఆవిష్కరించారు మన నేత న్న లు. నిండేన బారతీయిలు కు నిజమైన అందాలను ఇచ్చే విధంగా చేనేత వస్త్రాలను ధరించి నేతలను కు ప్రోత్సాహం ఇచ్చేవారు చేనేత మన వారసత్వం చేనేత మన ఆత్మ గౌరవం మన భారతీయ సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబించే చేనేత రంగానికి జీవం పోసి ప్రతి ఒక్కరూ చేనేత కార్మికులకు గర్వకారణం ఇచ్చే విధంగా వారి కష్టాన్ని నమ్ముకుని జీవిస్తున్న వారికి మనమంతా గౌరవం తెలుపుతూ వారి కలలు కన్న కలలు ను కాపాడాలని కోరారు. వద్దంటే బట్టలు నెయ్యి గుండె ధర పోతుంటే ఆరు గజాల చీర అగ్గి పెట్ట లో పెట్టే చేతి కుల వృత్తులు ఓర్అన ఓర్అన చేనేత పట్టు చీర నేసిన వస్త్రాలను అగ్గి పెట్టా లో పెట్టి అగ్గి పెట్టా అయ్యిందని. పద్మ శాలి ల గొప్ప మనసు ఉన్నవారు వారందరూ కలిసి నాకూ నేత అన్న లు కలిసి మూడు సార్లు భోజనం పెట్టే వారని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఆనాడు అన్నారు. సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని జై అనే చేనేత కార్మికుడు అద్భుతంగా సంప్రదాయం కొనసాగిస్తు అందరి మన్ననలు పొందుతు పట్టు చీర ను నేసి అగ్గి పెట్టే లో ఇమిడే పట్టు చీరలు తయారు చేసి తెలంగాణ నేతలు పని తీరును ప్రపంచవ్యాప్తంగా ప్రపంచ స్థాయి కి తీసుకెళ్ళి అందరి మన్ననలు పొందిన ప్రపంచ వ్యాప్తంగా పద్మ శాలి లాకు మంచి గుర్తింపు తెచ్చిన ఘనత ఆయనకే దక్కింది. అంతేకాకుండా అగ్గి పెట్టె లో ఇమిడిన మంచి శాలువ లను కూడా తయారు చేశారు. అని పలువురు వక్తలు పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో రాయికల్ మున్సిపల్ చైర్మన్ కటుకం రవీందర్ మాజీ చైర్మన్ మోర హనుమాన్ లు పద్మ శాలి సంఘం అధ్యక్షులు బోగ రాజేశం. ఉపాధ్యక్షులు దాసరి గంగాధర్ యువజన సంఘం అధ్యక్షులు సమల్లను సతీష్ కడకంట నరేష్ అడెపు రాజీవ్ సంఘం యొక్క సభ్యులు పాల్గొని వివిధ సభ్యులు ప్రసంగించారు. అదే విధంగా ఈ సందర్భంగా సమాజంలో ఉన్న చేనేత కార్మికుల ను సంఘ నాయకులు అందరి సమక్షంలో వారిని చేనేత కళాకారుల ను సన్మానం చేశారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల తెలంగాణ ఎక్స్ వేదిక గా శుభాకాంక్షలు తెలిపారు. సిరిసిల్ల కు చెందిన చేనేత కళాకారుడు వెల్ది హరి ప్రసాద్ 170 నిమిషం వ్యవధిలో అగ్గి పెట్టే లో అమర్ చీర ను నేషిన వీడియో ను పెంచుకుంటూ అతని ప్రతిభ ను కొనియాడారు..భారతీయ సంస్కృతి కి చేనేత హస్త కళా ప్రతీక అని ఆయన అన్నారు.

## జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా చేనేత కార్మికులకు ఘన సన్మానం



**కోరుట్ల, ఆగస్టు 7**
జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా కోరుట్ల పట్టణంలో తెలంగాణ చేనేత ఐక్యవేదిక రాష్ట్ర ఉపాధ్యక్షురాలు దీపారాణి-ధనుంజయ్ ఆధ్వర్యంలో చేనేత కార్మికులను ఘనంగా సన్మానించారు.కార్యక్రమానికి ముందు స్థానిక చేనేత సహకార సంఘం అధ్యక్షుడు గోనె శంకర్ చేనేత పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం చేనేత రంగానికి విశిష్ట సేవలు అందించిన ఎంబేరి భూమేశ్వర్, అందే వెంకటి, కటుకం రాజగంగారం, దాసరి దేవయ్య, గొడ్డుబర్ల జనార్ధన్, అల్లె శంకరయ్య (ముంబై), మ్యాకల రాజయ్య, ఎక్కలదేవి సురేందర్, చింతకింది శ్రీరాములు, కటుకం నారాయణలను శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ, భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు చేనేత పరిశ్రమ ప్రతీకగా నిలుస్తోందని పేర్కొన్నారు. చేనేత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం మరింత ప్రాధాన్యత ఇవ్వాలని, చేనేత రంగాన్ని పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి కులోన్నతి సంక్షేమ సంఘం అధ్యక్షుడు గుంటుక ప్రసాద్, జిల్లా అధ్యక్షుడు రుద్ర శ్రీనివాస్, శ్రీ శివమార్కండేయ కోటినవదుర్గ దేవాలయ చైర్మన్ జిల్లా ధనుంజయ్, పద్మశాలి సంఘ నాయకులు గడ్డం మధు, ఎంబేరి నాగభూషణం, అడెపు మధు, జిందం లక్ష్మీనారాయణ, మిట్టపల్లి శ్రీనివాస్ (ముంబై), పెండెం గణేష్, కట్కం జగదీశ్వర్, చింతకింది భూమానందం, అడెపు నరేష్ కుమార్, పద్మశాలి సంఘ ఉపాధ్యక్షుడు కటుకం వినయ్ కుమార్, ప్రధాన కార్యదర్శి బండ్ల రవి కుమార్, పద్మశాలి యువత అధ్యక్షుడు జక్కుల ప్రవీణ్ కుమార్, వయోవృద్ధుల సంఘ నాయకులు ఎక్కలదేవి గంగాధర్, సిరిపురం గంగాధర్, కటుకం రమేష్, రాడం అశోక్, సిరిపురం రాజేశ్వర్, భీమనాతి రాజేశ్వర్, గూడూరు చంద్రకాంత్, అల్లె లక్ష్మీనారాయణ, మాసం శంకర్,

## గిగ్ వర్కర్లకు ఊరట..

గిగ్ వర్కర్ల జీవితాలతో చెలగాట మాడుతున్న ఆ పదినిముషాల ప్రమాణాన్ని క్విక్‌కామర్స్ సంస్థలు వెనక్కు తీసుకోవడం బాగుంది. కేంద్రమంత్రి మాన్సుఖ్ మాండవీయ జోక్యం, ఒత్తిడి కారణంగానే ఇది సాధ్యపడింది. పలు క్విక్‌కామర్స్ సంస్థలు పదినిముషాల్లోనే కస్టమర్లకు ఆర్డర్లను డెలివరీ చేస్తామంటూ ఊరించి, తదనుగుణంగా ఈ వర్కర్లను పరుగులు తీయిస్తున్న అమా నవీయ విధానానికి తెరపడినందుకు సంతోషించాలి. దాదాపు అన్ని ప్రధాన సంస్థలూ తమ అప్లికేషన్ల నుంచి ‘టెన్‌మినిట్ డెలివరీ’ ప్రమా ణాన్ని ఉపసంహరించుకొని, డెలివరీ చేయగల కనిష్ఠ సమయాన్ని మాత్రం చూపిస్తున్నాయట. ఇది పదినిము షాలకు కాస్త అటూఇటూగా ఉంటున్నదంటూ సామాజిక మాధ్య మాల్లో కొందరు ఆక్షేపిస్తున్నప్పటికీ, గడువులు, హామీల పేరిట గిగ్‌వర్కర్లను వాయువేగంతో ప్రయా ణాలు చేయించే ప్రస్తుత విధానం సడలినందుకు సంతోషిం చాల్సిందే. పదినిముషాల మాటకు కట్టుబడి పనిచేయడానికీ, త్వరితంగా సరు కులు చేరవేయడానికీ తేడా ఉంది. ట్రాఫిక్‌లో సిగ్నల్ జంప్‌లు చేయడం, అడ్డుతోవలో చొచ్చుకురా వడం వంటివి చూసినప్పుడు గిగ్‌వర్కర్ల మీద మిగతా జనాలకు సహజంగానే ఆగ్రహం కలుగుతుంది. కానీ, చుట్టూ తిరిగి వస్తే సమయం మించిపో తుందన్న భయం, గడువులోగా డెలివరీ ఇవ్వాలన్న ఆత్రం వారితో ఇటువంటి పనులు చేయిస్తుంది. బుక్‌చేసిన పదినిముషాల్లో కస్టమర్ల చేతికి కోరింది చేరుతుంది కానీ, అందుకోసం ఈ కుర్రాళ్ళు తమ భద్రతనీ, ప్రాణాలను పణంగా పెట్టవలసి వస్తోంది.

# స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలి

**జగిత్యాల జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి.ఎస్ లత**



**జగిత్యాల, ఆగస్టు 07**

జగిత్యాల జిల్లాలో ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి.ఎస్ లత అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్ లోని మినీ సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులతో ఆగస్టు 15న నిర్వహించే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు సమన్వయ సమావేశంలో ఏర్పాట్ల పై శాఖల వారీగా సమగ్రంగా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి.ఎస్ లత మాట్లాడుతూస్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నిర్వహణ ఏర్పాట్ల పై ప్రతి శాఖకు అప్పగించిన బాధ్యతలను నిర్దేశిత గడువులో పూర్తి చేసి ఎలాంటి లోపాలకు తావులేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. వేడుకల ప్రాంగణంలో ప్రజాప్రతినిధులు, స్వాతంత్ర్య సమరయోధులు, విశిష్ట అతిథులు, అధికారులు, విద్యార్థులు, ప్రజలు సౌకర్యవంతంగా పాల్గొనేలా కూర్చోవడానికి తగిన ఏర్పాట్లు చేయాలని తెలిపారు. వేదిక, జాతీయ పతాకావిష్కరణ, పరేడ్, ముఖ్య అతిథి సందేశం, సాంస్కృతిక కార్యక్రమాలు, తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్, అత్యవసర వైద్య సేవలు, అగ్నిమాపక భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్, భద్రతా ఏర్పాట్లు తదితర అంశాల్లో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేసేలా వివిధ శాఖల ఆధ్వర్యంలో ఆకర్షణీయమైన ప్రదర్శన శకటాలు (టేబ్లోలు), అవగాహన స్టాల్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతి శాఖ తమ విభాగం అమలు చేస్తున్న వినూత్న కార్యక్రమాలు, ప్రభుత్వ పథకాల ఫలితాలు ప్రతిబింబించేలా శకటాలు, ప్రదర్శనలు రూపొందించాలని తెలిపారు. అలాగే ఉత్తమ ప్రదర్శనలు, వినూత్న శకటాలు, ఆకర్షణీయమైన స్టాల్స్ ద్వారా ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు సమర్థవంతంగా తెలియజేసేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. వేడుకల నిర్వహణలో పాల్గొనే ప్రతి శాఖ అధికారి తమ బాధ్యతలను పూర్తి నిబద్ధతతో నిర్వర్తించి స్వాతంత్ర్య దినోత్సవాన్ని జిల్లాకు ఆదర్శంగా నిలిచేలా విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ఎల్‌నినో ప్రభావంతో నీటి సంక్షోభం తీవ్రం కానుంది

**వరిసాగు మానుకుని ప్రత్యామ్నాయ పంటలను ఎంచుకోండి - జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్**



**జగిత్యాల, ఆగస్టు 07**

ఆగస్టు, సెప్టెంబర్నెలల్లో ఎల్‌నినో ప్రభావం మరింత తీవ్రంగా ఉండే అవకాశం ఉందని వాతావరణ అంచనాలు సూచిస్తున్నాయి. ఈ పరిస్థితుల కారణంగా వర్షపాతం తగ్గడంతో పాటు వర్షాల మధ్య సుదీర్ఘ విరామాలు ఏర్పడి, చెరువుల్లో నీటి నిల్వలు మరియు భూగర్భ జలాల మట్టాలు గణనీయంగా తగ్గిపోయే అవకాశం ఉంది. జిల్లాలోని మొత్తం1,010 చెరువులలో కేవలం 268 చెరువులు మాత్రమే ప్రస్తుతం నిండి ఉన్నాయి. ప్రస్తుతం ఉన్ననీటి నిల్వలు కూడా మొత్తం సాగు అవసరాలను తీర్చేందుకు సరిపోవని అంచనా. అదేవిధంగా, గత ఏడాదితో పోలిస్తే జిల్లాలో భూగర్భ జలాల మట్టం ఇప్పటికే సగటున 1.12 మీటర్లు తగ్గింది. ఆగస్టు, సెప్టెంబర్నెలల్లో ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం మరింత తగ్గితే భూగర్భజలాల మట్టాలు ఇంకా దిగజారే అవకాశం ఉంది. అదేవిధంగా, శ్రీరాంసాగర్ప్రాజెక్టు (రా=ప్రా)లో అందుబాటులో ఉన్న నీటిని తాగునీటి అవసరాలకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడే అవకాశం ఉన్నందున, వరిసాగుకు నీటి సరఫరాపై పూర్తిస్థాయిలో ఆధారపడే పరిస్థితి లేదు. ఈనేపథ్యంలో రైతులు ప్రస్తుతం లేదా ఇకపై కొత్తగా వరినాట్లు వేయడం, వరి సాగువిస్తీర్ణాన్నిపెంచడం పూర్తిగా నివారించాలని రైతులకు సూచన. అందువల్ల రైతులు వ్యవసాయశాఖ సూచించిన తక్కువ నీటి అవసరం కలిగి నప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని కోరనైనది. ముఖ్యంగా కందులు, పెసర, మినుములు, ఆముదం, జొన్న, సజ్జలు, మొక్కజొన్న (తగినతేమఉన్నప్రాంతాల్లోమాత్రమే)ఇతర తక్కువ నీటి అవసరం కలిగిన పంటలను ఎంచుకోవాలనిసూచించారు. ప్రత్యామ్నాయ పంటల ఎంపిక, విత్తనాల లభ్యత మరియు సాంకేతిక సూచనల కోసం రైతులు తమ పరిధిలోని వ్యవసాయ అధికారులను సంప్రదించగలరు.

# మృదుశక్తి మహిమను కోల్పోతున్నామా

ప్రపంచవ్యాప్తంగా మతాల మంచిచెడుల గురించి మాట్లాడటం ఇప్పుడు తగ్గిపోతోంది. నమ్మశక్యం కాకపోయినా ఇది నిజం! మత భావాలను రెచ్చగొట్టి, వాటికి అనుగుణంగా జనసమీకరణలు చేసే రాజకీయాలు చాలా దేశాల్లో పెరుగుతున్నాయి. అవి ఎంతగా పెరుగుతుంటే అంతగా మతాల మంచిచెడులపై సద్విమర్శలూ, సద్వివేచనలూ తగ్గిపోతున్నాయి. మత ఆధారిత రాజకీయాల్లో ఏదో విధంగా ఎదుటి మతాలను దుమ్మెత్తిపోయటం, చిన్నబుచ్చటం, వాటిపై విద్వేషభావాలను పెంచటం, కొందరు చేసిన తప్పులకు ఆ మతాలను అనుసరించే వారందరూ బాధ్యులే అన్నట్లుగా వ్యవహరించటం సాధారణంగా కనపడుతుంది. అందుకే మతాల గొప్పలు, వారసత్వాల ఆసరాతో రాజకీయంగా బలాన్ని పెంచుకునేందుకు పావులను కదపటం వల్ల అన్నిచోట్లా బలి అవుతున్నదీ మూల్యాన్ని చెల్లిస్తున్నదీ సమిధలవుతున్నదీ సాధారణ పౌరులే. బంగ్లాదేశ్‌లో ప్రస్తుతం కనపడే చిత్రం అదే. ప్రతిరోజూ హిందువులపై దాడులు, హత్యల వార్తలు వస్తూనే ఉన్నాయి. రాజ్యాన్ని ఇస్లామీకరి స్తామనీ, చట్టాలన్నిటినీ షరియా, హాదిత్‌లకు అనుగుణంగా మార్చేస్తామనీ చెప్పే జమాత్‌ఇ–ఇస్లామీ లాంటి సంస్థలు బంగ్లాదేశ్‌లో అధికారం కోసం తహతహలాడు తున్నాయి. ప్రతి రాజకీయ సంక్షోభాన్ని.. కొన్నిమెట్లు పైకెక్కేలా ఉపయోగించుకోవటంలో మతతత్వ సంస్థలు ఎప్పుడూ ముందుంటూనే ఉన్నాయి. జనాగ్రహ వెల్లువలో షేక్‌హసీనా ప్రభుత్వం కూలిపోయిన తర్వాత మతతత్వ సంస్థల, పార్టీల రాజకీయ చురుకుదనం బాగా పెరిగింది. అచ్చమైన, స్వచ్ఛమైన ఇస్లామిక్ పాలన తీసుకొస్తామనే నినాదాలు తప్ప జనజీవితాలను గణనీయంగా మార్చే ఆర్థిక విధానాలు మతతత్వ సంస్థలకు సహజంగానే ఉండవు. వాటికి కావాల్సిందల్లా ఒక మతం ప్రజలను నిత్యం శత్రువులా పరిగణించే రాజకీయాలు మాత్రమే. అక్కడి హిందువులందరినీ భారత అనుకూలురుగా, ఏజెంట్లుగా, ఇస్లాం వ్యతిరేకులుగా ఆరోపణలూ చేస్తూ దాడులకు పాల్పడుతూ మతప్రాతిపదికన ప్రజల్లో బలాన్ని పెంచుకోవటం వాటికి అవసరం. అందుకోసం చేసే మూకదాడులూ, దేవాలయాల విధ్వంసాలూ వారి దృష్టిలో నేరచర్యలు కావు. మతంతో సంబంధంలేని పౌరహక్కులకు వాటి దృష్టిలో ఎటువంటి విలువా లేదు. మతాతీతంగా అందరికీ వర్తించే పౌరహక్కుల భావనకు ఆ సంస్థలు వ్యతిరేకం. వచ్చేనెలలో ఆ దేశంలో ఎన్నికలు జరగనున్నాయి కాబట్టి మతతత్వ విద్వేషాలు మరింతగా రెచ్చగొడుతున్నారు. బంగ్లాదేశ్ నేషనల్ పార్టీ (బీఎన్‌పీ), నిన్నమొన్నటి వరకూ అధికారాన్ని చలాయించిన అవామీలీగ్ పార్టీ సమ యానుకూలంగా మతతత్వ పార్టీలు, సంస్థల అండదండలను అందిపుచ్చుకున్నవే. ఈ రెండు ప్రధానపార్టీలు మతతత్వంతో అంటకాగకపోతే పరిస్థితి కాస్త భిన్నంగా ఉండేది. కానీ ఇప్పుడు దాన్ని వదులుకునే రీతిలో ఆ పార్టీల్లేవు. ప్రభుత్వానికీ, పాలనకూ ఇస్లాం విధానాలనే ఆలంబన చేసుకుంటామనీ రెండుపార్టీలూ ఎప్పుడో స్పష్టం చేశాయి. బంగ్లాదేశ్ ఏర్పడిన తొలినాళ్లలో రూపొందిన రాజ్యాంగంలో లౌకికవాదాన్ని పాలనకు మూలస్తంభంగా పేర్కొన్నారు. మతం ఆధారంగా నడిచే పార్టీలనూ నిషేధించారు. సోషలిజాన్ని రాజ్యాంగ మౌలిక సూత్రంగానూ పరిగణించారు. లౌకిక, సామ్యవాద పదాలను భారత రాజ్యాంగం నుంచి తొలగించాలని డిమాండు చేసే వారికి ఈ సంగతి తెలియకపోవచ్చు. తెలిసినా అప్రియసత్యాలను ప్రస్తావించటం ఇష్టమూ ఉండకపోవచ్చు. మనకంటే ముందుగానే (1972లో) వాటిని బంగ్లాదేశ్ రాజ్యాంగంలో పొందుపరిచారు. అధికారాన్ని పదిలం చేసుకోటానికి రాజకీయ కారణాలతో లౌకికవాదం నుంచి వైదొలగటమే బంగ్లాదేశ్‌లో ఇప్పుడు నెలకొన్న విద్వేష వాతావరణానికి ఒక ప్రధానకారణం. భారత్‌కు అనుకూలంగా వ్యవహరించినంత మాత్రాన అవామీలీగ్ లౌకికపార్టీ అయిపోదు. అవసరాన్ని బట్టి జమాత్–ఇ–ఇస్లామీతో జట్టుకట్టిన చరిత్ర ఆ పార్టీకి ఉంది. లౌకికవాదాన్ని రాజ్యాంగ మౌలిక సూత్రంగా 1977లో మిలటరీ పాలకులు తొలగించారు. అల్లా పట్ల సంపూర్ణ విశ్వాసం, భక్తి ఉందనే పదాలను రాజ్యాంగ పీఠికలో చేర్చారు. ఇక 1988లో ఇస్లాంని రాజ్యమతంగా అధికారికంగా ప్రకటించారు. షేక్ హసీనా 1996లో తొలిసారి అధికారంలోకి వచ్చినా వాటిని తీసివేయటానికి ప్రయత్నించలేదు. 2011లో భారీ మెజారిటీతో ప్రభుత్వ పగ్గాలను చేపట్టిన తర్వాత లౌకికవాద పదాన్ని మళ్లీ రాజ్యాంగంలో చేర్చినా రాజ్యమతంగా ఇస్లాం అనేదాన్నీ, పీఠికలో ప్రవేశపెట్టిన అల్లా పట్ల సంపూర్ణ విశ్వాసం--భక్తి లాంటి వ్యక్తీకరణలను అలాగే ఉంచేశారు. 2014 మార్చి 23న షేక్‌హసీనా చేసిన కీలక ప్రకటనతో బంగ్లాదేశ్ లౌకికవాదం వైపు మొగ్గే అవకాశం దాదాపుగా ముగిసిపోయింది. మహమ్మద్ ప్రవక్త మదీనాలో చేసిన చివరి ప్రసంగం ఆధారంగానే బంగ్లాదేశ్ పాలన ఉంటుందనీ, ఖురాన్--సున్నత్‌లకు భిన్నంగా ఎలాంటి చట్టమూ దేశంలో రాదనీ హసీనా స్పష్టంచేశారు. లౌకికవా దాన్ని పాలనకు మౌలికసూత్రంగా పేర్కొంటూ రాజ్యాంగాన్ని రూపొంది ంచి, అమల్లోకి తెచ్చిన (1972 నవంబర్ 4) అవామీలీగ్ మతానికి రాజకీయంగా పెద్దపీట వేయటం బంగ్లాదేశ్‌కు చెడ్డమలుపుగానే చెప్పుకోవాలి. దాన్నుంచి వెనక్కివెళ్లే కొత్త రాజకీయాలు ఇప్పుడక్కడ కనుచూపు మేరలో కూడా లేవు. బంగ్లాదేశ్‌లో మూకదాడులు, మతప్రేరిత హత్యలు ఘోరమైనవి, హేయమైనవి, మానవతా దృక్పథానికి వ్యతిరేకమైనవి. అయినా వాటిని ఒక పెద్ద ప్రజాస్వామ్య దేశంగా, లౌకికవాదానికి నిబద్ధమైన దేశంగా బలంగా ఖండించలేని నైతిక సందిగ్ధతలో భారత్ ఉండిపోతున్న పరిస్థితే కనపడుతుంది. హిందూ మతాభిమాన ఉద్వేగాలతో సామాజిక మాధ్యమాల్లో ఖండనలు తీవ్రంగానే వెలువడుతున్నాయి. కానీ విశ్వమానవ పౌరహక్కుల దృష్టితో చూస్తే అవి పరిమితమైనవి, పాక్షికమైనవి. మత ఆలోచనలకు అతీతంగా ఆధునిక నాగరికత అందించిన పౌరహక్కుల పరిధి చాలా విశాలమైంది. ఆ పౌరహక్కుల స్పృహ లోతుగా మన హృదయాల్లో, మనసుల్లో పాదుకుంటే అన్నిరకాల మతవిద్వేష దాడులపై ఆగ్రహం కలుగుతుంది. ఆవేశం పెల్లుబికుతుంది. వివేచనతో కూడిన ఆచరణను పురిగొల్పుతుంది. బయటే కాదు దేశంలోపలా పెట్రేగుతున్న విద్వేషాలకు ఎదురొడ్డి నిలబడగలిగితేనే ఆ పౌరహక్కులకు సార్థకత ఉంటుంది. అలా చేయలేనప్పుడు మనకు నైతికశక్తి కొరత ఏర్పడుతుంది. బంగ్లాదేశ్‌లోని అకృత్యాలపై బలహీన గొంతులకు కారణం ఆ కొరతే! బంగ్లాదేశ్ హిందువులు ఇప్పుడు అన్నివైపుల నుంచీ సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారు. ఇస్లాం రాజ్యమతం అయిన తర్వాత, చట్టాలన్నిటికి ఆ మత సిద్ధాంతాలు, పద్ధతులు ప్రాతిపదికలవుతాయని ప్రకటించిన తర్వాత తమ అస్తిత్వాలు శాశ్వత ప్రమాదంలో ఉన్నాయనే భయమే వారిని ఆవహిస్తోంది. అధిక సంఖ్యాకుల మతం, సంస్కృతి, విశ్వాసాలు, ఆధిపత్యాలకు తలవొగ్గి ఉండాల్సిన పరిస్థితులు మైనారిటీ మతాల వారిని మామూలు మనుషులుగా ఉండనీయవు. సహేతుకత, ఉన్నత న్యాయదృష్టి లేకుండా మతం, సంస్కృతి, సంప్రదా యాలను చిన్నబుచ్చే ప్రయత్నాలను ప్రజలు తేలికగా జీర్ణించుకోలేరు. మెజారిటీ మతాన్ని అన్నివిధాలుగా ఆకాశానికెత్తుతూ, మైనారిటీల మతాన్ని తక్కువచేసి చూపటం సామాజిక వైషమ్యాలను సృష్టిస్తుంది. బంగ్లాదేశ్‌లో ఈ విపరిణామాలన్నీ విస్తృతంగా జరుగుతున్నాయి. వీటిని కాదనలేం. అదే సమయంలో భారత్ మైనారిటీలూ అలాంటి అస్తిత్వ సంక్షోభాన్ని ఎదుర్కోవటం లేదా? అంటే.. కాదని చెప్పలేం! తరతరాల తమ అస్తిత్వానికి తగిన ప్రాధాన్యం ఇవ్వటం లేదనే భావన ఎక్కడైనా ప్రమాదకరమే. పాలకుల మతం ఆధారంగా దేశచరిత్రలో స్వర్ణయుగాలు, చీకటియు గాలు ఉంటాయని పదేపదే ప్రచారం చేయటం విద్వేష భావాలనే కలగచేస్తుంది. ఇస్లాం మతం అనుసరించిన పాలకులందరూ పీడకులేననీ, వారి పాలనలో దేశం అన్నిరంగాల్లో అధోగతి పాలైందనే ఆరోపణలు అత్యున్నత స్థాయినుంచి రావటం తీవ్రమైన ఆత్మన్యూనతా భావాన్ని సృష్టిస్తుంది. నిరంతరం ఆ పరిస్థితిలో ఉన్నవారు విపరీత ధోరణులకు తేలికగా ప్రభావితం అవుతారు. బహుళమత భారతావనికి అసలుసిసలైన ప్రమాదం ఇదే. ప్రజాస్వామ్యానికి భారత్‌ను పుట్టినిల్లుగా చెప్పుకోవటం తేలికే. చరిత్రలో మనం ప్రజాస్వామ్యాలుగా, గణతంత్రాలుగా పిలిచేవేవీ నిజమైన ప్రజాస్వామ్యాలు కావు.

## వెనెజువెలాలో అమెరికా

# అభీష్టం నెరవేరేనా




చమురు విపణిపై ఆధిపత్యం అనేది అమెరికా విదేశాంగ విధానాన్ని నిర్ణయాత్మకంగా నిర్దేశించే అంశాలలో ముఖ్యమైనది. వెనెజువెలాను దురాక్రమించడం ద్వారా చమురు రాజకీయాగ్నులను ఎగదోసి, ప్రపంచ దేశాలతో సరికొత్త చెలగాటానికి అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ శ్రీకారం చుట్టారు. ఇప్పుడు వెనెజువెలా, అంతకు ముందు ఇరాన్, ఇరాక్, లిబియాలతో అగ్రరాజ్యానికి ఉన్న వైరానికి చమురు ప్రధాన కారణమని ప్రత్యేకంగా చెప్పవల్సిన అవసరం లేదు. తమ జాతీయ ప్రయోజనాలకు ఏ దేశమూ చమురు విషయంలోగానీ, మరే సహజసంపద విషయంలో గానీ స్వతంత్రంగా వ్యవహరించడం అమెరికాకు సుతరామూ గిట్టదు గాక గిట్టదు. చమురు నిల్వలు సమృద్ధిగా ఉన్న దేశాలపై దండయాత్ర చేయడమనేది అమెరికాకు ఇదేమీ మొదటిసారి కాదు. ఇతర దేశాలలో జోక్యం మూలంగా అమెరికాకు వాటిల్లిన నష్టాల గురించి ట్రంప్ గత ఏడాది తన ఎన్నికల ప్రచారంలో తరచూ ప్రస్తావించారు. తత్కారణంగా అంతర్జాతీయ వ్యవహారాలలో గత అధ్యక్షుల వలే కాకుండా భిన్న విధానాలను ట్రంప్ అనుసరించవచ్చునని భావిస్తున్న తరుణంలో వెనెజువెలా ఉదంతం చోటుచేసుకోవడం అమెరికా ప్రజానీకాన్ని దిగ్భ్రాంతిపరిచింది. వెనెజువెలా సహజసంపదపై పెత్తనం చెలాయించే ప్రయత్నాలను ప్రపంచ ప్రజలూ నిశితంగా గమనిస్తున్నారు. దేశాలను దురాక్రమించినంత మాత్రాన తాను ఆశించిన రీతిలో చమురు సంపదను ఉత్పత్తి చేయడం అమెరికాకు సాధ్యమవుతుందా? ఇరాక్, లిబియా దేశాల ఉదంతాల నుంచి అమెరికా గుణపాఠం నేర్చుకోలేదని అనిపిస్తోంది. చమురు ఉత్పత్తి సామర్థ్యం పెంపుదల అనేది నిరంతర కృషి, భారీ పెట్టుబడులతో కూడిన వ్యవహారం. ఏ వ్యాపార సంస్థ అయినా తమ పెట్టుబడులకు రాబడులు వస్తాయని ప్రగాఢంగా విశ్వసించిన చోట మాత్రమే మదుపులు చేస్తుంది. చమురు నిక్షేపాలను వెలికితీయడానికి భౌగోళిక పరిస్థితులతో పాటు ఆయా ప్రాంతాలలోని ప్రజా సహకారం కూడా అవసరం. స్థానికుల తోడ్పాటు లేకుండా పురోగతి అసాధ్యమనే విషయాన్ని ఇరాక్, లిబియాలను చూస్తే తెలుస్తోంది. జీవాయుధాలు, అణ్వస్త్రాలతో తమ ప్రజలపై దాడులు చేస్తోందనే వ్యూహాత్మక తప్పుడు ప్రచారంతో జార్జి బుష్ 2003లో ఇరాక్‌ను దురాక్రమించారు. ఆ కాలంలో చమురు ఉత్పాదక దేశాల కూటమి (ఒపెక్)లో సౌదీ అరేబియా తర్వాత రెండవ స్థానంలో ఇరాక్? ఉంది. అమెరికా, దాని మిత్ర దేశాల సైనిక బలగం, ఇరాక్‌లోని అసమ్మతి, తిరుగుబాటు దళాలు, తెగల సహాయం ఉన్నప్పటికీ అమెరికన్ చమురు సంస్థలు తమ ఉత్పత్తి సామర్థ్యాన్ని ఇతోధికంగా పెంపొందించుకోవడంలో విఫలమయ్యాయి. లిబియాలో ఆ దేశాధినేత గడాఫీని హతమార్చి ఆ చమురు ఉత్పాదక దేశాన్ని అమెరికా హస్తగతం చేసుకున్నది. అమెరికా లేదా ఐరోపా చమురు సంస్థలు ఏవీ కూడా ఇప్పటికీ లిబియాలో తమ ప్రతాపాన్ని చూపలేకపోతున్నాయనేది ఒక నమ్మవలసిన వాస్తవం. ఒక పరాయి దేశాన్ని సైనిక, సాంకేతిక సామర్థ్యంతో దురాక్రమించడం ద్వారా ఆ దేశ సంపదను దోచుకోవడం అంత సులభతరమా? అయిన పక్షంలో ప్రపంచంలోకెల్లా శ్రేష్ఠతరమైన నాణ్యత ఉన్న చమురుగా పేరున్న ఇరాక్ చమురు నిక్షేపాలపై ఆధిపత్యాన్ని నిలబెట్టుకోకుండా ఆ దేశం నుంచే అమెరికా ఎందుకు నిష్క్రమించింది? స్వల్ప మోతాదులో సల్ఫర్ ఉండి, అధిక మొత్తంలో పెట్రోలును తక్కువ వ్యయంతో విడుదల చేసే ఇరాక్ చమురుకు, వెనెజువెలా చమురుకు మధ్య పెద్ద వ్యత్యాసం ఉంది. ఇరాక్ ఎడారిలో తక్కువ లోతులో లభించే క్రూడ్‌లో ఎక్కువ మోతాదులో పెట్రోలు వెలువడుతుంది. ఆ తరువాత ప్లాస్టిక్ ఉత్పత్తి, ఆటోమొబైల్ పరిశ్రమల్లో వినియోగించే రసాయనాలు వెలువడుతాయి. ఇరాక్‌తో పాటు అరబ్బు దేశాలలో ఉత్పత్తి అయ్యే ఈ రకం చమురు తేలికగా ఉంటుంది. భారతదేశంలోని అన్ని రిఫైనరీలకు దీన్ని సునాయాసంగా శుద్ధి చేసే సామర్థ్యం ఉంది. వెనెజువెలాలో సాధారణంగా నీళ్ళ కింద లభించే క్రూడ్‌లో సల్ఫర్ అధికంగా ఉంటుంది. దట్టంగాను, జిగటగాను ఉంటుంది. దీని నుంచి డీజిల్ ఎక్కువ మోతాదులో వెలువడుతుంది. ఆ తర్వాత తారు ఉత్పన్నమవుతుంది. పెట్రోలు, రసాయనాల భాగం తక్కువగా ఉంటుంది. క్రూడ్‌ను పైపుల ద్వారా రవాణా చేయడానికి అందులో అదనంగా రసాయనాలు కలపవలసి ఉంటుంది. పైగా వెనెజువెలా క్రూడ్‌ను శుద్ధిచేయడం రిఫైనరీలకు అదనపు వ్యయంతో కూడుకున్న పని. భారతదేశంలో ఇటువంటి క్రూడ్‌ను శుద్ధి చేసే రిఫైనరీ ఒక్కటే ఉన్నది. అది రిలయెన్స్ కంపెనీది. విశాఖతో సహా మిగిలిన రిఫైనరీలకు వెనెజువెలా తరహా క్రూడ్‌ను శుద్ధి చేయడమనేది అదనపు పని భారం. మరో ముఖ్యమైన వాస్తవం–చమురు ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంపొందించడానికి యంత్రసామగ్రి, విశాల భూభాగంలో పైపు లైన్ల కొరకు భారీ పెట్టుబడులు అవసరం. దీని ఫలితాలు రావడానికి కనిష్ఠంగా పది సంవత్సరాల కాలం పడుతుంది. అప్పటికి అమెరికా విధానం ఏ విధంగా ఉంటుందో చెప్పలేం. చమురు ఉత్పత్తి సామర్థ్యం పెంపుదలకు ఇంతకుముందే చెప్పినట్లుగా నిరంతర కృషి, భారీ పెట్టుబడులతో పాటు ముందు చూపుతో కూడిన దీర్ఘకాలిక ప్రణాళికలు అవసరం. సత్వర లాభాపేక్షతో వ్యవహరించే అమెరికా సంస్థలు అందుకు సిద్ధంగా ఉన్నాయా అనేది సందేహమే. ప్రపంచవ్యాప్తంగా ధరలు పతనమవుతున్న ప్రస్తుత తరుణంలో స్థానిక ప్రజాభీష్టానికి విరుద్ధంగా వెనెజువెలాలో జూదమాడడానికి అమెరికన్ చమురు సంస్థలు ఎంత వరకు ఇష్టపడతాయి? ఈ విషయంపైనే అమెరికా విదేశాంగ విధాన సాఫల్యం ఆధారపడి ఉంది.

# బావిలో నీటి వింత అలజడి

**గుజరాత్ గ్రామంలో ఆశ్చర్యకర ఘటన**
**భూకంపంతో సంబంధం లేదన్న అధికారులు**
**భూగర్భ గాలి ఒత్తిడే కారణమని అంచనా**
**నిపుణుల బృందం పరిశీలనకు సిద్ధం**



**మోర్బీ, ఆగస్టు 7 :**
గుజరాత్ రాష్ట్రంలోని మోర్బీ జిల్లాలో ఓ వ్యవసాయ బావిలో చోటుచేసుకున్న వింత పరిణామం స్థానికులను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. విర్పర్ద గ్రామ పరిధిలోని ఒక బావిలో నీరు కొన్ని రోజులుగా వాటంతట అవే ఉవ్వెత్తున ఎగసిపడుతూ అలల మాదిరిగా కదులుతుండటంతో ప్రజలు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకుంటున్నారు. మొదట ఇది భూకంపానికి సంకేతమేమోనని అనుమానాలు వ్యక్తమైనప్పటికీ, ప్రాథమిక పరిశీలనలో అలాంటి ప్రమాదం లేదని అధికారులు స్పష్టం చేశారు. విర్పర్ద గ్రామానికి చెందిన రైతు ప్రాంజీవన్ సదరియా తన పొలంలో మూడు నెలల క్రితం సుమారు 18 అడుగుల లోతుతో ఈ బావిని తవ్వించాడు. ఆగస్టు 2 నుంచి బావిలోని నీటిలో అసాధారణ కదలికలు కనిపించడం ప్రారంభమైంది. నీరు నిరంతరం అలల మాదిరిగా కదలడమే కాకుండా, కొన్ని సందర్భాల్లో బావి అంచులను దాటి బయటకు పొంగిపొర్లినట్లు గ్రామస్థులు తెలిపారు. ఈ అరుదైన దృశ్యాన్ని చూసేందుకు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు భారీగా తరలివస్తున్నారు. బావి వద్దకు చేరుకున్నవారు నీటి కదలికలను తమ సెల్‌ఫోన్లలో చిత్రీకరిస్తూ ఆసక్తిగా గమనిస్తున్నారు. సామాజిక మాధ్యమాల్లో కూడా ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలు విస్తృతంగా ప్రచారం కావడంతో మరింత మంది అక్కడికి చేరుకుంటున్నారు. జిల్లా భూగర్భ శాస్త్రవేత్త జే.ఎస్. వాఢేర్ స్పందిస్తూ, ఈ ఘటనకు భూకంపంతో ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా భూగర్భ జలాలు వేగంగా నిండుతున్నాయని, ఈ క్రమంలో రాళ్ల మధ్య చిక్కుకుపోయిన గాలి నీటి ఒత్తిడి కారణంగా ఒక్కసారిగా బయటకు రావడంతో బావిలో అలజడి ఏర్పడుతుందని ప్రాథమికంగా అంచనా వేస్తున్నట్లు తెలిపారు. గాంధీనగర్‌లోని భూకంప పరిశోధనా సంస్థ కూడా ఈ ప్రాంతంలో ఎలాంటి క్రియాశీల భూపాత రేఖ లేదని, ఇటీవల భూ ప్రకంపనలు నమోదు కాలేదని వెల్లడించింది. దీంతో గ్రామస్థులు భయాందోళనలకు గురికావాల్సిన అవసరం లేదని అధికారులు సూచిస్తున్నారు. అయినప్పటికీ ఈ సహజ ప్రక్రియపై మరింత లోతైన అధ్యయనం అవసరమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఈ ఘటనపై రాష్ట్ర ప్రభుత్వానికి సమాచారం అందించినట్లు మోర్బీ జిల్లా కలెక్టర్ స్వప్నిల్ ఖరే తెలిపారు. పూర్తి స్థాయి పరిశీలన కోసం గాంధీనగర్ నుంచి ప్రత్యేక నిపుణుల బృందం త్వరలో గ్రామానికి చేరుకోనుంది. క్షేత్రస్థాయిలో అధ్యయనం అనంతరం బావిలో నీరు ఇలా అలల మాదిరిగా కదలడానికి గల అసలు కారణంపై స్పష్టమైన నివేదిక వెలువడే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు.

# చేనేతకు రాష్ట్రపతి ప్రశంసలు

**జాతీయ చేనేత పురస్కారాల ప్రదానం**
**రాష్ట్రపతి భవన్‌లో ఘన వేడుకలు**
**చేనేత వారసత్వాన్ని కొనియాడిన ద్రౌపది ముర్ము**
**యువత కొత్త అవకాశాలు అందిపుచ్చుకోవాలని పిలుపు**






**న్యూఢిల్లీ, ఆగస్టు 7:**
12వ జాతీయ చేనేత దినోత్సవ వేడుకలు రాష్ట్రపతి భవన్ సాంస్కృతిక కేంద్రంలో ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ముఖ్య అతిథిగా హాజరై సంత్ కబీర్ చేనేత పురస్కారాలు, జాతీయ చేనేత పురస్కారాలు--2025 విజేతలకు అవార్డులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి మాట్లాడుతూ భారత నాగరికత పరిణామ క్రమంలో చేనేతకు శతాబ్దాల చరిత్ర ఉందని పేర్కొన్నారు. దేశ సంస్కృతి, సంప్రదాయాలు, ప్రాంతీయ ప్రత్యేకతలను ప్రతిబింబించే గొప్ప వారసత్వంగా చేనేత రంగం నిలిచిందన్నారు. భారతదేశంలోని విభిన్న ప్రాంతాల కళాత్మక నైపుణ్యాన్ని చేనేత ఉత్పత్తులు ప్రపంచానికి పరిచయం చేస్తున్నాయని రాష్ట్రపతి తెలిపారు. ప్రతి ప్రాంతానికి ప్రత్యేకమైన నేసిన వస్త్రాలు భారత వైవిధ్యాన్ని ప్రతిబింబిస్తున్నాయని పేర్కొన్నారు. సంప్రదాయ చేనేత కళలను ఆధునిక రూపకల్పనలతో అనుసంధానం చేయాల్సిన అవసరం ఉందన్నారు. సమర్థవంతమైన బ్రాండింగ్, అంతర్జాతీయ మార్కెట్ అనుసంధానం ద్వారా చేనేత ఉత్పత్తులకు మరింత విస్తృత అవకాశాలు లభిస్తాయని అభిప్రాయ పడ్డారు. యువ పారిశ్రామికవేత్తలు, రూపకర్తలు, నవ్య ఆలోచనలతో ముందుకొచ్చే సంస్థలు చేనేత రంగంలో కొత్త అవకాశాలను సృష్టించగలవని రాష్ట్రపతి సూచించారు. సాంప్రదాయ నైపుణ్యాన్ని ఆధునిక మార్కెట్ అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దితే భారత చేనేత ప్రపంచవ్యాప్తంగా మరింత గుర్తింపు పొందుతుందన్నారు. చేనేత రంగం లక్షలాది కుటుంబాలకు ఉపాధి కల్పించడంతో పాటు దేశ సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షిస్తున్నదని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు. చేనేత కళాకారుల కృషి దేశ గర్వకారణమని కొనియాడుతూ, వారి సేవలను గుర్తించి పురస్కారాల ద్వారా గౌరవించడం సంతోషకరమని తెలిపారు.

# నా భార్య నన్ను చంపాలని చూస్తుంది

**హత్యకు కుట్ర పన్నారంటూ ఆరోపణలు**
**చాటింగ్ స్క్రీన్‌షాట్లు పోలీసులకు అందజేత**
**జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు**





**ఖమ్మం, ఆగస్టు 7:**
తన భార్య, ఆమెకు పరిచయం ఉన్న వ్యక్తి కలిసి తనను హత్య చేయించేందుకు కుట్ర పన్నారని ఆరోపిస్తూ ఓ భర్త పోలీసులను ఆశ్రయించిన ఘటన మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలంలో కలకలం రేపింది. భార్య మొబైల్ ఫోన్‌లో కనిపించిన వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ సందేశాల ఆధారంగా బాధితుడు ఫిర్యాదు చేయగా పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. డోర్నకల్ మండలం చిలుకోడు గ్రామానికి చెందిన గాదె రాజేశ్వరరావు ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో ఉద్యోగం చేస్తున్నాడు. 2016లో సూర్యాపేట జిల్లా రాఘవాపురానికి చెందిన యువతిని వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. గత నెల 27న మధ్యాహ్నం ఇంటికి వెళ్లిన సమయంలో తన భార్య మరో వ్యక్తితో చనువుగా ఉండటాన్ని గమనించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ విషయాన్ని కుటుంబ పెద్దల సమక్షంలో చర్చించాలని భావించి మరుసటి రోజు తన అన్నను తీసుకురావడానికి వెళ్లినట్లు తెలిపాడు. ఆ సమయంలో భార్యతో కనిపించిన వ్యక్తి తనను వెంబడించినట్లు గుర్తించి పట్టుకునే ప్రయత్నం చేయగా తప్పించుకుని పారిపోయాడని పేర్కొన్నాడు. దీంతో అనుమానం మరింత పెరగడంతో భార్య మొబైల్ ఫోన్‌ను పరిశీలించానని, అందులో ఉన్న సందేశాలు చూసి దిగ్భ్రాంతికి గురైనట్లు రాజేశ్వరరావు తెలిపాడు. ఇంట్లో కాకుండా బయట ప్రమాదంలా కనిపించే విధంగా హత్య చేయాలని భార్య, పురిమెట్ల సైదులు అనే వ్యక్తి మధ్య సందేశాలు మారినట్లు ఆరోపించాడు. దీనికి సంబంధించిన వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ చాటింగ్ స్క్రీన్‌షాట్లను కూడా పోలీసులకు అందజేశాడు. భార్య, ఆమె సన్నిహితుడు కలిసి తన ప్రాణాలకు ముప్పు కలిగించే కుట్ర పన్నారని ఆరోపిస్తూ ఈ నెల 1న డోర్నకల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి కేసును ఖమ్మం రూరల్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. తాజాగా బాధితుడు ఖమ్మం రూరల్ పోలీసులను మరోసారి కలిసి పూర్తి వివరాలు అందించాడు. ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో విచారణ చేపడుతున్నామని పోలీసులు తెలిపారు. ఆరోపణల నిజానిజాలను దర్యాప్తు అనంతరం నిర్ధారించనున్నట్లు వెల్లడించారు.

# ముల్లపెరియార్‌పై సీఎం వివరణ

**రైతుల ప్రయోజనాలపై ప్రత్యేక చర్చ**
**కురువై సాగుకు మద్దతు చర్యల వివరణ**
**తమిళనాడు ప్రభుత్వ చర్యలపై ప్రకటన**
**నీటి అంశాలపై ప్రభుత్వ స్పష్టీకరణ**




**చెన్నై, ఆగస్టు 7 :**
తమిళనాడు ముఖ్యమంత్రి ఎస్. జోసెఫ్ విజయ్ రాష్ట్ర శాసనసభలో ముల్లపెరియార్ ఆనకట్ట అంశం, కావేరీ డెల్టా ప్రాంతంలోని కురువై సాగుపై ప్రభావానికి సంబంధించిన ప్రత్యేక చర్చలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను సభకు వివరించారు. ముల్లపెరియార్ ఆనకట్ట వ్యవహారంలో తమిళనాడు ప్రభుత్వ వైఖరి, చేపట్టిన చర్యలపై ముఖ్యమంత్రి సమగ్ర వివరణ ఇచ్చారు. రాష్ట్ర ప్రయోజనాలను కాపాడేందుకు ప్రభుత్వం అవసరమైన చర్యలు కొనసాగిస్తోందని పేర్కొన్నారు.కావేరీ డెల్టా ప్రాంత రైతుల సమస్యలను దృష్టిలో ఉంచుకుని కురువై పంట సాగుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. సాగునీటి లభ్యత, రైతుల అవసరాలను పరిశీలిస్తూ తగిన చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. కురువై పంట సాగు చేసిన రైతులకు ప్రత్యేక కొనుగోలు సౌకర్యాలు కల్పిస్తున్నట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు. రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వ ఆధ్వర్యంలో కొనుగోలు చేసే ఏర్పాట్లు చేపట్టినట్లు చెప్పారు.రైతుల ఆదాయాన్ని పెంచడం, సాగు వ్యయ భారం తగ్గించడం లక్ష్యంగా పలు కార్యక్రమాలు అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. వ్యవసాయ రంగ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ముల్లపెరియార్ ఆనకట్ట అంశంతో పాటు కావేరీ డెల్టా ప్రాంత వ్యవసాయ ప్రయోజనాల పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా చర్యలు కొనసాగిస్తుందని ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ సభలో వెల్లడించారు.

# జీహెచ్‌ఎంసీ బరిలో బీజేపీ ఒంటరి పోరు

**పొత్తులు ఉండవని రామచందర్‌రావు స్పష్టం**
**పార్టీ బలోపేతంపై జాతీయ నాయకత్వం దిశానిర్దేశం**
**డబుల్ ఇంజిన్ సర్కార్ లక్ష్యమన్న బీజేపీ**




**న్యూఢిల్లీ, ఆగస్టు 7**
రానున్న గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్‌ఎంసీ) ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ ఒంటరిగానే పోటీ చేస్తుందని ఆ పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్‌రావు స్పష్టం చేశారు. తెలంగాణలో ఎటువంటి రాజకీయ పొత్తులు లేకుండానే ఎన్నికల బరిలోకి దిగుతామని ఆయన వెల్లడించారు. ఢిల్లీలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్‌తో సమావేశమైన అనంతరం రామచందర్‌రావు మీడియాతో మాట్లాడారు. జీహెచ్‌ఎంసీ ఎన్నికలను పార్టీ అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంటోందని, స్వతంత్రంగా పోటీ చేసి ప్రజల మద్దతు పొందడమే లక్ష్యమని తెలిపారు. రాష్ట్ర బీజేపీలో ఎలాంటి విభేదాలు లేవని, కేవలం అభిప్రాయ భేదాలు మాత్రమే ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. పార్టీ బలోపేతానికి అందరూ సమిష్టిగా కృషి చేస్తున్నారని, సరైన సమయంలో పలువురు కీలక నేతలు బీజేపీలో చేరనున్నారని వెల్లడించారు.తెలంగాణ ప్రభుత్వంలో పెరుగుతున్న అవినీతి, పాలనా వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని జాతీయ నాయకత్వం సూచించినట్లు చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీల అమలు తీరుపై ప్రజలకు వాస్తవాలు తెలియజేస్తామని పేర్కొన్నారు. అసెంబ్లీ సమావేశాల అనంతరం పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలతో ప్రత్యేక సమావేశం నిర్వహించి భవిష్యత్ కార్యాచరణపై చర్చించనున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని మండలాల్లో పార్టీని సంస్థాగతంగా మరింత బలోపేతం చేసేందుకు చర్యలు చేపడుతున్నామని చెప్పారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో తెలంగాణలో డబుల్ ఇంజిన్ సర్కార్ ఏర్పాటు చేయడమే తమ ప్రధాన లక్ష్యమని రామచందర్‌రావు పునరుద్ఘాటించారు. రానున్న జీహెచ్‌ఎంసీ ఎన్నికలు రాష్ట్రంలో బీజేపీ బలాన్ని చాటిచెప్పే కీలక మైలురాయిగా నిలుస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు.

